# మగాడు

## జ్యోతి

"సరే!... ఓయ్... విన్నే... సరితా!. విన్పిస్తోందా?" లోపలికి చూస్తూ షర్ట్‌ని టక్ చేస్తూ భార్యనుద్దేశించి అన్నాడు కరుణాకర్.

"ఎందుకలా అరుస్తారు? ఇక్కడేగా వున్నాను' లోపల్నుంచి విన్పించింది సరిత గొంతు.

'ఎంత సేపోయ్ త్వరగా బయల్దేరు. టైమవుతోంది"టై సవరించుకుంటూ, నిలువుటద్దం ముందు అతని ప్రతిబింబాన్ని మనసారా తృప్తిగా చూస్కుంటూ అన్నాడతను.

"అబ్బ.. దేనికో ఆ టైము.."

"దేనికేంటి? మీ అన్నయ్యా వాళ్ళింటికెళ్ళన్నాంగా?"

"ఏమిటంత కంగారు? టైమ్ చాలా వుందిగా.. అయినా ఈరోజేమిటో శ్రీవారు ప్రత్యేకంగా మేకప్ అయినట్టున్నారు.. కొత్తగా ఏ గర్ల్‌ఫ్రెండ్ అన్నా దొరికిందా ఏమిటి?' ఓరగా భర్తనే చూస్తూ. అతను చటుక్కున ఆమెనే చూసేసరికి ఏమీ ఎరగనట్టుగా చీర కుచ్చెళ్ళకు పిన్ పెట్టుకుంటుందామె.

"కొత్త గర్ల్‌ఫ్రెండ్స్.. అబ్బో.. అంటే ఇంతవరకు పాతగర్ల్‌ఫ్రెండ్స్ ఎంత మంది తెలుసో తమరికి? అయినా.. మహంకాళివి. నువ్వుండగా వచ్చేదైనా రాదుగా?" బూట్లు తొడుగుతూ అన్నాడతను.

"ఇప్పుడైనా మించిపోయిందేం లేదు. ప్రతి ఆదివారం నేనెలాగూ వుండను. మీ ఇష్టమే ఇక.. మీరెవరితో తిరిగినా, ఇంటికే తీసుకొచ్చినా అడిగేవారు, చూసేవారు ఎవరూ లేరుగా?" ఆమె జోక్‌గానే అన్నా ఆ మాట అతనిలో చిన్నగా కంగారు పుట్టించింది.

"అంత సీనేం లేదుగానీ, అయిందా లేదా నీ పని?" అంటూ అతను సోఫాలో కూర్చుంటూ. ఆమె చెయ్యిపట్టుకుని విసురుగా లాక్కున్నాడు పైకి. అనుకోని అతని చిలిపిచేష్టకు అనుకోకుండా అతని ఒళ్ళో పడింది సరిత వేగంగా.

"వదలండి ఏమిటిది? చీర నలిగిపోతుంది"సుస్మితంగా విడిపించుకోబోయింది సరిత.

"ఇంత అందమైన గర్ల్‌ఫ్రెండ్ వుండగా, మరో గర్ల్‌కోసం ఎందుకాలోచిస్తానోయ్" ఆమె కళ్ళల్లోకే సూటిగా చూస్తూ నిజాయితీగా, నిష్కల్మషంగా అడుగుతున్నట్టుగా అన్పించగానే సరితకూడా ఒక్క క్షణం అతని కళ్ళలోకే చూస్తూ తన రెండు చేతుల్లోకి అతని ముఖాన్ని తీసుకుని ప్రేమగా అతని రెండు బుగ్గలపై ముద్దు పెట్టుకుందామె.

"మధ్యలో పాపం ఆ బుల్లి పెదవులేం పాపం చేశాయో.." అతని మాటల్లో కొంటెతనానికి అందంగా సిగ్గుపడి అతన్నించి విడిపించుకోవడానికి ప్రయత్నించింది సరిత.

"ఏయ్ తప్పించుకోవడానికి ప్రయత్నించకు" అల్లరిగా అన్నాడు కరుణాకర్ మరికాస్త గట్టిగా బంధిస్తూ.

"అవతల మనం వెళ్ళాలి వదలండి.." అంది సరిత అతన్నించి మళ్ళీ విదిలించుకునే ప్రయత్నంలో.

"ఓ.. మై స్వీట్ హార్ట్.. ఐ లవ్.. యూ డియర్" అస్పష్టంగా గొణుగుతున్నట్టుగా అంటూ అతని పెదవులు ఆమెపెదవుల్ని ఆత్రంగా అందుకున్నాయి.

"ఇక చాలించండి... ప్లీజ్.. వదలండి.." అతని బలమైన చేతుల పట్టు నుంచి తప్పించుకోవాలని శతవిధాలా ప్రయత్నిస్తుందామె.

"వదలాలన్పించట్లేదురా"

"రోజూ కొత్తేనా మీకు?" చిరుకోపం ప్రదర్శించింది సరిత.

"వైఫ్ అండ్ హజ్బెండ్ మధ్య ఎప్పుడూ కొత్తదనమే వుండాలి డియర్.. అప్పుడే థ్రిల్ వుంటుంది" తమాషాగా కళ్ళెగరేస్తూ అలా అతనంటుంటే ఆమెకు గర్వంగా అన్పించింది.

సరితకు ఎప్పుడూ తన భర్తను చూస్కుంటూ వుంటే గర్వంగానే అన్పిస్తూ వుంటుంది. ఆరడుగుల అందగాడు... అతను వెళ్తూ వుంటే ఆడపిల్లలే తిరిగి మరీ చూస్తు వుంటారు. ఆమెకు మరో గొప్ప నమ్మకం ఏమిటంటే తన భర్తకు తను తప్ప ఇంకెవరూ నచ్చరనే మూఢ నమ్మకం. ఎందుకంటే కనీసం కన్నెత్తి చూడటానికి కూడా ఇష్టపడదు అనే పిచ్చి నమ్మకంతోనే తనకు తానే గర్వంగా ఫీలవుతుంది.

"ఆ చిట్ ఫండ్ కంపెనీలో లీగల్ అడ్వైజర్‌గా చెయ్యకపోతే" చక్కగా అడ్వకేట్‌గా ప్రాక్టీస్ పెట్టుకోవచ్చును?"

"అప్పుడు ఓ అడ్వకేట్ భార్యగా నిన్ను జాబ్ చెయ్యనివ్వనుగా"

"అమ్మో... నేను జాబ్ మాత్రం వదలను"

"మరెలా చెప్పు నాకు సోమవారం సెలవు దొరికితే, నీకు ఆదివారం సెలవు... సో.... మనిద్దరికి ఒకే రోజు సెలవు కలిసి వచ్చేటట్టుగా ఎప్పుడూ వీలవదు. నా కోసం నువ్వు అనవసరంగా సోమవారం కూడా సెలవు తీసుకోవలసి వచ్చింది. అందువల్ల అదే మనం ప్రాక్టీస్ స్టార్ట్ చేశాం అనుకో.. మనకి కావల్సినంత టైమ్ మనమే చేసుకోవచ్చు... ఏమంటావు?"

"మరేం ఫర్వాలేదు లెండి... సోమవారం ఒక్క రోజు సెలవు తీసుకున్నందు వల్ల నాకేం నష్టం లేదు గానీ... నేను మాత్రం జాబ్ వదిలే ప్రసక్తే లేదు అర్థమైందా" కరుణాకర్ ముక్కు పట్టి ఊపి లేచి చీర సర్దుకుంటూ..." "వెళ్దామా ఇక" అంది.

సరిత ఆఫీస్ మానడం అనేది నిజానికి అతనికీ నచ్చదు కాకపోతే ఆమె సోమవారం కూడా తన కోసం సెలవు పెట్టడం అసలే నచ్చడం లేదు. ఆ ఒక్క సోమవారం తనని ఒంటరిగా వదిలేస్తే తను మరీ హాపీగా ఫీల్ అవుతాడు. ఇంకా నయం ఆమెకు దొరికిన ఆ ఒక్క సన్‌డే మాత్రం బుద్ధిమంతురాలిలా వాళ్ళన్నయ్య వాళ్ళింటికి వెళ్ళిపోతూ వుంటుంది. అందుకు ఆనందించాలి. ఆ సన్‌డే కూడా ఏ ఒక్కసారైనా ఆమె "ఎందుకు లెద్దురూ? ఈ ఒక్కరోజూ మీరు కూడా సెలవు పెట్టయ్యరాదు ఎంచక్కా హాయిగా వుండొచ్చు" అని అందా? అమ్మో... అంతకన్నా ఆమె భయంకరమైన నిర్ణయం మరొకటి వుండదు తన విషయంలో అందుకే ఆమె అలా అన్నప్పుడు మాత్రం తను ఇచ్చితంగా వెళ్ళాలి అంటాడు ఆఫీసర్. ఇక రోజంతా ఒంటరిగా వుండడం ఆమెకు సాధ్యం కాక వెళ్తూ వుంటుంది. పాపం ఆమెకేం తెల్సు ఆ సన్‌డే తను కూడా సెలవు తీస్కుంటాడని. తను సెలవు తీసుకునేది సరిత కోసం కాదు థర్డ్ ఫ్లోర్‌లో వుండే మాధురి కోసం.

"ఏమిటి సార్ ఆలోచిస్తున్నారు? ఈ పూట ఏ కారణం చెప్పి ఆఫీస్‌కి సెలవు పెట్టయ్యానా అనా?"

సరిత మాటతో "నో నో... సారీ .... పద ... టైమయిపోయింది. ఈ రోజు ఆఫీస్‌లో చాలా వర్క్ వుంది. నిన్నక్కడ డ్రాప్ చేసి నేను ఇమీడియెట్‌గా వెళ్ళాలి ... కమాన్" కీస్ తీస్కుని పైకి వచ్చాడు అతను.


"ఈవెనింగ్ త్వరగా వచ్చేస్తారుగా? లేకపోతే... ఆటో తీస్కుని నేనే వచ్చేస్తాను" స్కూటరెక్కుతూ అంది సరిత.

"వద్దొద్దు... ఓ వన్ అవర్ అటూ ఇటూ అయినా నేనే వస్తాను" అతనికి చాలా త్వరగా సరితను డ్రాప్ చేసి రావాలనుంది.

మాధురి వెయిట్ చేస్తూ వుంటుందనే ఆలోచన రావడంతో స్కూటర్ని మరింత వేగంగా పోనిచ్చాడు కరుణాకర్.

* ****

టెలిఫోన్ రింగవడంతో రిసీవరు చేతిలోకి తీస్కుంది మాధురి.




"హలో... ఈజిట్ ఎస్‌ఆర్ కప్పల్‌టెప్సీ?" అందమైన గొంతు...

"సురేష్ గారు లేరు" టక్కున రిసీవర్ డిస్‌కనెక్ట్ చేసిందామె మాధురికి. ఇలాంటి కాల్సేం కొత్తకాదు. కాకపోతే అవతల్నుంచి తన భర్త సురేష్ కోసం వచ్చే కాల్సన్నీ ఇలాంటి విచిత్రమైన కాల్స్ కావడం ఒకటైతే దానికి తనిచ్చే ఆన్సర్ కూడా విచిత్రంగానే వుంటుంది.

తను లిఫ్ట్ చేస్తే ఏవో రాంగ్ నెంబర్ కాల్స్‌లా బిహేవ్ చేస్తారు అవతలి వాళ్ళు. అతను లిఫ్ట్ చేస్తే చక్కగా మాట్లాడతారు.

అతను ఇంట్లో వున్నప్పుడు, ఏ కాల్ కూడా రాంగ్ నెంబరు రాదు.

అతను లేని సమయంలో మాత్రమే వస్తూ వుండడం తనకి అలవాటయిపోయింది.

అందుకేతను పెద్దగా ఆలోచించడం వాటి కోసం.

అనాలోచితంగా డోర్ ఓపెన్ చేసింది మాధురి, అప్పుడే కాలింగ్ బెల్‌పై చెయ్యి వెయ్యబోతున్న కరుణాకర్‌ను చూడగానే నవ్వింది మాధురి.

ఆమె వెనుకే లోపలికి వస్తూ డోర్ వేశాడు కరుణాకర్.

"సురేష్ వెళ్ళిపోయాడని కన్‌ఫమ్ చేసుకున్నావా"

కరుణాకర్ ప్రశ్నకు ఫ్రిజ్ డోర్ తీసి వాటర్ బాటిల్ పైకి తీస్తూ సమాధానం ఇచ్చింది మాధురి మద్రాస్ నుంచి అరగంట క్రితమే ఫోన్ చేశారు" మంచి నీళ్ళందిస్తున్న ఆమె సన్నటి చేతి వేళ్ళనే చూస్తూ "రియల్లీ... మాధురీ... నీ చేతి వేళ్ళు చాలా అందంగా వుంటాయి" అన్నాడు ఆమె అందిస్తున్న గ్లాసుతో పాటుగా ఆమె చేతిని కూడా పట్టుకుంటూ.

మాధురి మధురంగా నవ్వి డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరికెళ్ళి నిల్చుంది.

'తన భార్య తప్ప పరాయి ఆడాళ్ళ చేతులూ, కాళ్ళూ కూడా అందంగా కన్పించడం సహజం' ఆ మాట మాధురి అనక పోయినా ఒక్క క్షణం ఆమె మౌనం ఆ అర్థాన్నిచ్చిందనడానికి నిదర్శనమే అతనలా ఫీలవడం.

వెనుక నుంచి పొడుగ్గా క్రింద వరకు వ్రేలాడే ఆమె జడంటే అతనికెంత ఇష్టమో... "రియల్లీ మాధురీ... నీకు ఆ భగవంతుడు ఇంత అందం ఇచ్చి నాకు కాకుండా చేయడం చాలా అన్యాయం కదూ! సరిత కన్నా ఒక్క రోజు ముందు నువ్వు నాకు ఎదురైతే నిన్ను ఎత్తుకు పోయి వుండేవాడిని"

ఆమె మళ్ళీ నవ్వింది మనోహరంగా

13.9.96 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

"అదుగో... ఆ నవ్వు... ఆ నవ్వే నన్ను పిచ్చి వాడిని చేస్తూ వుంటుంది. అందుకే... అందుకే మాధురీ... నిన్ను నేను వదల లేక పోయేది... నిన్ను నేను వదులుకోను.. నాకేం చెయ్యాల్లో అర్ధం కావడం లేదు. ఒక్క రోజు నిన్ను చూడకపోతే నాకు అసలేం తోచదు. ఒక్కోసారి అన్పిస్తూ వుంటుంది. ఈ ప్రపంచం అంతా మాయమై పోయి మనిద్దరం మాత్రమే మిగిల్తే ఎలా వుంటుంది అని... ఒకోసారి నాకెంత ఆవేశం వస్తుంటుందంటే నిన్ను తీస్కుని ఈ ఉద్యోగం కూడా వదిలేసి, ఈ సమాజానికి దూరంగా... ఎవరికీ అందనంత దూరంగా వెళ్ళి పోవాలని... మాధురీ... ఇప్పడు నిజంగా అంటున్నాను. మనం ఎక్కడికైనా వెళ్ళిపోదామా చెప్ప ప్లీజ్..." అతని ఆవేశానికి మధ్యలోనే ఆనకట్ట వేసింది కాలింగ్ బెల్.

మల్లెల్ని తల్లో పెట్టుకోబోతూ తెరవమన్నట్టుగా చూసింది మాధురి.

కరుణాకర్ డోర్ ఓపెన్ చేశాడు... ఎదురుగా సురేష్... ఆకాశంలో మెరుపులూ, ఉరుములూ లేవు... భూమి బద్దలైపోనూ లేదు... అవన్నీ ఒకేసారి మొదలయ్యాయి కరుణాకర్ మెదడులో.

నిస్సహాయంగా మాధురి వైపు చూశాడతను. ఆమె నిలువెల్లా నీరుకారి పోతుందనుకున్న కరుణాకర్ మాధురి నిశ్చలంగా నిల్చుని వుండడం మరింత ఆశ్చర్యానివ్వగా ఏం చెయ్యాలో అర్ధంకాక వెర్రివాడిలా నిల్చున్న కరుణాకర్‌కు దారి కడ్డంగా నిల్చుని వున్న సురేష్ ప్రక్కకు తప్పకుని దారిచ్చాడు.

ఎలా వచ్చాడో ఫ్లాట్‌లోకి... బెడ్ మీద కూర్చుని పిచ్చివాడిలా రెండు చేతుల వేళ్ళు జుట్టులోకి పోనిచ్చి తీవ్రంగా ఆలోచించసాగసాడు. మాధురి పరిస్థితి ఏమిటీ? సురేష్ ఆమెనేం చేస్తాడు?

'మర్డర్ చేస్తాడా? అంత ధైర్యం చెయ్యకపోయినా మగాడు కదా అందులో మొగుడు... ఏ బెల్టో చేతిలోకి తీసుకుని అతని కసి తీరే దాకా ఆమెని... అతని ఆలోచనలకు మధ్యలోనే అంతరాయం కలిగిస్తూ డోర్ తెరుచుకోవడం, వెనువెంటనే సురేష్ ఒక చేతిలో సూట్ కేసు, మరో చేతిలో మాధురి చెయ్యితో ప్రత్యక్షం కావడం రెప్పపాట్లో జరిగిపోయాయి.

కరుణాకర్ కు ఒక్క నిమిషం మెదడు పని చెయ్యలేదు.

"నేను లేని సమయంలో నా భార్యతో నా బెడ్ రూంలో ఎందుకున్నావని ప్రశ్నించడానికి రాలేదు... ఈ వ్యవహారం ఎంతకాలం నుంచి సాగుతోందని నిలదియ్యడానికి రాలేదు... సో... ఈమె కోసం మరో మంగళ సూత్రానికే ఆర్డరిస్తావో లేక... నీకు ఉంపుడు గత్తెగా మరో ఇల్లు తీసి వుంచుకుంటావో అది నీ ఇష్టం... ఆలోచించుకోండి ఇద్దరూ".

అతను సూట్‌కేసు ఆమె ప్రక్కన దబ్బున పెట్టి చక చకా మెట్లు దిగుతూ క్రిందకి వెళ్ళిపోయాడు.

కరుణాకర్ పెదాలు తడారిపోతున్నాయి.

అతనికిప్పుడుమాధురిని తీసుకొని ఏ సుదూర తీరాలకో వెళ్ళిపోవాలని అన్పించడం లేదు. ఆమె లేకుండా ఒక్క రోజు కూడా గడప లేనవే డైలాగ్ కూడా గుర్తుకు రావడం లేదు.

అతని కళ్ళ ముందు ప్రస్తుతం కన్పిస్తున్నదల్లా ఒక్కటే...

సమాజం, కట్టుబాట్లు, భార్య, వృత్తి, అతని భవిష్యత్తు... ఒక్కొక్కటే కళ్ళ ముందు వరుసగా ప్రత్యక్ష మవుతుంటే ఈ పరిస్థితిలో మాధురిని ఏం చేయాలి? తన పరిస్థితి ఏమిటి? పిచ్చిగా వుందతనికి. అతి కష్టం మీద ఆరిపోతున్న పెదాల్ని తడి చేస్కుకుంటూ అన్నాడు కరుణాకర్.

"మాధురీ... ఆవేశంలో ప్రతీ మగాడు ఇలాగే ఆలోచిస్తాడు... సో... సురేష్ మాత్రమే కాదు... ఎవరైనా ఈ సందర్భంలో ఒక్కటే ఆలోచిస్తారు... నాకేం చెయ్యాలో ఆలోచననే అందడం లేదు... పోనీ... నేనే వెళ్ళి అతన్ని బ్రతిమాలి..."

"దైవ సాక్షిగా మా ఇద్దరికీ ఏ సంబంధం లేదు నమ్మండి అని చెప్తారా"

ఆ మాట ఆమె మామలుగానే అన్నా ఛెళ్ళున కొట్టినట్లయింది అతనికి. "అదేగా మీరు చెప్పేది?" మాధురి ప్రశ్నలకు తట్టుకోలేక పోతున్నాడు కరుణాకర్.

"ఇప్పడు నన్నేం చెయ్యమంటావు మాధురీ" అసహనాన్ని దాచుకుంటున్నట్లుగా అన్నాడు కరుణాకర్.

"మీ రేమి చెయ్యనక్కర్లేదు... భయపడి పోవద్దు.. నన్ను విడిచి వుండలేరని అన్నారుగా అంటూ అమాయకంగా గుర్తు చెయ్యడానికి రాలేదు, మనం ఎక్కడికైనా దూరంగా వెళ్ళి పోదామా అంటూ పిచ్చిదానిలా అడగడానికి కూడా రాలేదు.."

అతని చెంపలు ఎర్రగా కంది పోతున్నాయి దెబ్బలాంటి ఆమె మాటకే

"నాకు తెలుసు కరుణాకర్‌గారు మగాడంటే ఏమిటో... ప్రాక్టికల్‌గా కట్టుకున్నందుకు నా భర్త సురేష్‌ని చూశాను. దానికి మరో నిదర్శనంగా మిమ్మల్ని చూశాను... మీరేం చెయ్యగలరని ఆశిస్తాను నాకోసం? మీరు కూడా సాధారణమైన మగాడేగా? పరాయి స్త్రీలతో తిరుగుతూ ఆ సంగతి భార్యకు తెలిసినా అతని ఆనందానికి మాత్రం ఆటంకం కాకూడదు ఆమె. పైగా అది భరించాలి. పతివ్రతగా వుండి, సమాజంలో ఉత్తమ ఇల్లాలిగా అతని గౌరవాన్ని మాత్రం నిలబెట్టాలి. అదే పని భార్య చేస్తే...? ఒక్క నిమిషం కూడా భరించ లేదు అతను. అనుక్షణం నరకం అనుభవిస్తూ అలాంటి భర్తతో సంసారం చేసే కన్నా అతనితో తెగతెంపులు చేసుకోవడమే సుఖం. కాకపోతే నేను అనుభవించే నరకం... ఆయనకి ప్రాక్టికల్‌గా తెలియ చెయ్యడం కోసం మాత్రమే ఆయనతో అదే ఇంట్లో... ఈ రోజు దాకా వున్నాను. ఏదేమైనా ... నా జీవితం... నా చేతిలోనే వుంది ఇందులో ఎవరూ జోక్యం చేసుకోవనవసరం లేదు... మీకు వీలైతే నాకో సహాయం చెయ్యగలరా?"

పెదాల్ని తడువుకుంటూ చెప్పమన్నట్టుగా చూశాడామెను.

"ఓ వెయ్యి రూపాయిలు కావాలి నాకు"

అతను ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా పర్స్‌లోంచి తీసి ఇచ్చాడు.

"మనియార్డ్ర్ చేస్తాను మళ్ళీ" వాటిని తీస్కుంటూ అంది.

"ప్లీజ్ ... వద్దు"

అతని కంగారుకు అర్ధం స్పష్టంగా అర్ధమైంది మాధురికి.

అతని ఇబ్బంది, భయం, కంగారు ఆమెకు చిన్నగా నవ్వు తెప్పించాయి. కుడి చేతికి వున్న నాలుగు బంగారు గాజుల్లో ఓ గాజు తీసి అతనికి అందిస్తూ అంది మాధురి "ఊరికే మీ దబ్బు నాకు వద్దు. ఈ గాజు నాది దీన్ని ఏ బంగారవు షాపులో ఇచ్చినా డబ్బిస్తారు... మీకు దీనివల్ల ఎలాంటి ప్రాబ్లెమ్స్ రావు".

అతని వద్దంటున్నా అతని ముందున్న టేబుల్‌పై పెట్టి చేతిలోకి సూట్ కేసు తీస్కుని నెమ్మదిగా అడుగులు వేస్కుంటూ వెళ్ళి పోతున్న మాధురిని చూస్తూ నోట్లోంచి ఇంకే మాట రాని వాడిలా... కనీసం మళ్ళీ ఆమెను "ఎక్కడికెళ్తున్నావ్" అని కూడా అడగడానికి సాహసించలేక పోయాడు కరుణాకర్

